Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

Editor : Dama Vijaya Kumar | Volume : 6 | issue: 350 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :350 | ఆదివారం 21 డిసెంబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4



## టీఎంసీ సంరక్షణలో చొరబాటుదారులు

- విరుచుకుపడిన మోదీ..
- పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుంది
- అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయి
- చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది
- పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుంది



## ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోంది

- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ
- దేశంలో కోట్లాదిమంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసింది
- అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారినవారి జీవితాలకు ఆ పథకం ఉపాధి మార్గంగా నిలిచింది

### ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా

# రాష్ట్రాభివృద్ధి ఆగదు

- రాక్షసులు వివిధ రూపాల్లో ఏపీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- రుషికొండకు బోడిగుండు కొట్టి యోగా దినోత్సవంపై విమర్శలా?
- అనకాపల్లి జిల్లాలో స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు కడుతుంటే జైల్లో పెడతామని బెదిరించడం వారి రాక్షసత్వానికి నిదర్శనం
- స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా ప్రజల జీవన విధానంలో మార్పు తేవాలనే లక్ష్యంతో దీనికి శ్రీకారం చుట్టాము.



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాళ్లపాలెం**

రుషికొండ ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు దుర్వినియోగం చేసిన వాళ్లు...ప్రజారోగ్యం కోసం యోగా నిర్వహించిన తమపై విష ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి ప్యాలెస్, రంగు రాళ్లపై బొమ్మల కోసం వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారే కానీ ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా అని ప్రశ్నించారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు కడుతుంటే జైల్లో పెడతామని బెదిరించడం వారి రాక్షసత్వానికి నిదర్శనమని సీఎం అన్నారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ముందుగా పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించి ఆ తర్వాత కంపోస్ట్ తయారీ యార్డును సందర్శించారు. అనంతరం ప్రజా వేదిక సభలో - మిగతా3లో

## 'బీఐఈఏపీ'కి ఎన్‌సీవీఈటీ గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణం

### దేశంలోనే తొలిసారి ఒక స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డుకు ఎన్‌సీవీఈటీ గుర్తింపు లభించడం విశేషమని

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**



రాష్ట్రంలోని 'బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్' ఎన్‌సీవీఈటీ (నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్) నుంచి గుర్తింపు పొందడం రాష్ట్రానికి గర్వకారణమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. దేశంలోనే తొలిసారి ఒక స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డుకు ఎన్‌సీవీఈటీ గుర్తింపు లభించడం విశేషమని తెలిపారు. దీంతో వృత్తి నైపుణ్యాలకు జాతీయ స్థాయిలో సర్టిఫికేషన్ అందించే అవకాశం కలుగుతుందని వెల్లడించారు. తొలి దశలో సెరికల్చర్ టెక్నీషియన్ అర్హతకు అనుమతి లభించిందన్నారు. ఇది యువత భవిష్యత్‌కు, ఉద్యోగ అవకాశాలకు దారి తీస్తుందని వ్యాఖ్యానించారు. విద్యతో పాటు నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చే పాలన దిశగా ఇది కీలక ముందడుగు అని వివరించారు.

### వారణాసి రోప్‌వే పనులపై

## స్విస్ రాయబారి ప్రశంసలు

- వారణాసి రోప్‌వే ప్రాజెక్టును పరిశీలించిన స్విస్ రాయబారి
- డిసెంబర్ 31 నాటికి 5 స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయాలని యూపీ సర్కార్ ఆదేశం
- దేశంలోనే మొట్టమొదటి ప్రజా రవాణా రోప్‌వేగా గుర్తింపు
- 45 నిమిషాల ప్రయాణం ఇక కేవలం 15 నిమిషాలకు తగ్గింపు
- స్విస్ టెక్నాలజీతో రూ.815 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణం
- ఈ రోప్ వే ప్రాజెక్టు నిర్మాణం జరుపుతున్న తెలుగు సంస్థ విశ్వ సముద్ర ఇంజినీరింగ్

## 28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- రైతుల ఖాతాల్లో రూ.7,300 కోట్లు జమ: మంత్రి నాదెండ్ల
- ధాన్యం శాంపిల్స్ తీయడంలో ఇబ్బందులు రావడం వల్లే తేమశాతంలో తేడాలు
- పరిష్కారం దిశగా చర్యలు
- 43 వేలమంది రైతులు వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించామన్న మంత్రి నాదెండ్ల
- వాట్సప్ ద్వారా 43 వేల మంది రైతులు ధాన్యం విక్రయం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే గిట్టుబాటు కాక అప్పులపాలవుతున్నారు. ప్రధానంగా పంట చేతికందే సమయంలో దళారులు ధరలను అమాంతం తగ్గించడం కనిపిస్తోంది. ప్రస్తుతం ధాన్యం రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంది. రైతు వాట్సప్ ద్వారా సందేశం పంపించి ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం కల్పించారు. అయితే క్షేత్రస్థాయిలో కొనుగోలు ఎలా జరుగుతుందనేది రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈ క్రమంలోనే కృష్ణాజిల్లా తోట్లవల్లూరులోని రైతులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నేటికి వరకు - మిగతా3లో



### ఈ విధమైన అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదు...

## దీనిని ఆ దేశాలు గుర్తించాలి

- శక్తిమంత దేశమైనా సరే తన ఇష్టాలను ఇతరులపై రుద్దవద్దన్న జైశంకర్
- ప్రపంచీకరణ, మన ఆలోచన, పని విధానాల్లో ఎన్నో మార్పులు తీసుకు వచ్చిందన్న కేంద్రమంత్రి
- పుణేలో సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ప్రసంగం

# మీ చాప్టర్ క్లోజ్



- జగన్ రెడ్డి ఇంకా భ్రమలోనే బతుకుతున్నారు
- పీపీపీపై జగన్‌ది ద్వంద్వ వైఖరని మంత్రి సవిత విమర్శ
- ఢిల్లీలో ఎంపీల మద్దతు, ఇక్కడ గల్లీ రాజకీయాలని ఎద్దేవా
- కోడి కత్తి, గులకరాయి డ్రామాల్లాగే సంతకాల డ్రామా అని ఫైర్
- మెడికల్ కాలేజీలను పీపీపీలోనే పూర్తి చేస్తామని స్పష్టీకరణ
- అభివృద్ధికి అడ్డుపడితే రాష్ట్ర ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరిక

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఇంకా పాత భ్రమల్లోనే బతుకుతున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు 'డైవర్షన్' రాజకీయాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల విషయంలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంపై వైసీపీది ద్వంద్వ వైఖరని, వారి ఎంపీలు ఢిల్లీలో మద్దతుగా సంతకాలు పెట్టి, ఇక్కడ గల్లీలో జగన్ డ్రామాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. శనివారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. గతంలో కోడికత్తి, గులకరాయి డ్రామాలతో ప్రజలను మోసం చేసిన జగన్, ఇప్పుడు 'కోటి సంతకాలు' అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని - మిగతా3లో



## సరైన సమయంలో నన్ను, సిద్ధరామయ్యను పిలుస్తామన్నారు

- కర్ణాటక ముఖ్యమంత్రి పదవిపై మళ్లీ రాజుకున్న వివాదం
- ఈ విషయం అధిష్ఠానం చేతుల్లో ఉందన్న డీకే శివకుమార్
- అధికారిక పనుల నిమిత్తం మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్న డీకేశ్

# పద్ధతులు మార్చుకోండి

- కాలికి కాలు, చెయ్యికి చెయ్యికి అనేలా ట్రీట్ చేస్తే... వారంతా కకావికలమే: పవన్
- తూర్పుగోదావరి జిల్లాలోని నిర్వహించిన సభలో డిప్యూటీ సీఎం పవన్
- వైసీపీ నేతలు గీతలు దాటి మాట్లాడొద్దని హెచ్చరించరాయన.
- 'విభజన వల్ల నష్టపోయాం.. ఇక నష్టపోకూడదనే మేమంతా ఏకమయ్యాం
- ఎవరి ప్రాణ త్యాగంతో రాష్ట్రం ఏర్పడిందో వారిని స్మరించుకోవడం మన ధ్యేయం
- త్యాగజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి దండ వేద్దామంటే ఎక్కడా విగ్రహం కనిపించలేదు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తూర్పుగోదావరి**

పెరవలిలో నిర్వహించిన సభలో వైసీపీపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిప్పులు చెరిగారు. వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉండగా వైసీపీకి భయపడేదిలేని, పదేళ్లుగా పార్టీ పెట్టి కూడా వెనక్కు తగ్గానని జనసేన అధినేత చెప్పుకొచ్చారు. సీట్లు అమ్ముకున్నానని తనపై విమర్శలు గుప్పించారన్న పవన్.. ప్రజల కోసమే సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన బూర్గుల రామకృష్ణా రావు, పొట్టి శ్రీరాములే తనకు స్ఫూర్తి అని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'విభజన వల్ల నష్టపోయాం.. ఇక నష్టపోకూడదనే మేమంతా - మిగతా3లో

# అక్రమ నిర్మాణాన్ని ఆపండి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
అన్నమయ్యజిల్లా పీలేరు పట్టణంలోని పద్మావతి ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమిలో రాత్రివేళ అక్రమంగా నిర్మాణ పనులు చేపట్టడం ప్రజాస్వామ్యంపై, చట్టాలపై జరిగిన బహిరంగ దాడి అని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ అన్నారు. ఈ ఘటనపై ఎ.బి.ఎమ్.ఎస్.జె.ఏ.సి రాయలసీమ అధ్యక్షులు గుర్రం నారాయణ, ఎన్.ఎస్.యూ.ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి సంపత్‌తో కలిసి ఈవో బ్రహ్మానంద రెడ్డి వినతిపత్రం సమర్పించారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నూతన ఎస్సై ధర్మారెడ్డికి చిరు సత్కారం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఇటీవల నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ధర్మారెడ్డిని ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు శనివారం పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. గతంలో గాజుల మండ్యం పోలీస్ స్టేషన్లో ఎస్సైగా ధర్మారెడ్డి పనిచేసినప్పుడు వారి పరిధిలో ఆషా సంస్థ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. అదేవిధం గారానున్న రోజుల్లో రేణిగుంటలో ఆషా సంస్థ ద్వారా చేసే సేవా కార్యక్రమాలకు ఎస్ఐ సహకారం కావాలని జూలియన్ రాజు కోరారు.

## పరిసరాలు పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
అన్నమయ్య జిల్లా పీలేరు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ నంద రెడ్డి ఏఎంసి చైర్మన్ పురం రామూర్తి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు ప్రతి నెల మూడో శనివారం జరిగే "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని పట్టణంలోని చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు యల్లెల రెడ్డప్పరెడ్డి, ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర దేవి రెడ్డి రమణారెడ్డి, రైతు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రహమతుల్లా, రెడ్డిముని, తదితరులు పాల్గొన్నారు.

## కోలాహాలంగా కోలా సోమశేఖర్ జన్మదిన వేడుకలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
మండల కేంద్రమైన చౌడేపల్లిలో పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కోలా సోమశేఖర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆ పార్టీ నాయకుడు గందోడి చరణ్ రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు, మంచికి మారుపేరుగా నిలిచిన సోమశేఖర్ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు, అనంతరం అనేక వాహనాలతో కోలా సోమశేఖర్ నివాసం రొంపిచర్లకు వెళ్లి అక్కడ భారీగా జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు హేమంత్, శ్రీకాంత్, పుంగనూరు నాయకులు రమణా రాయల్, చిన్న రాయల్, నరేష్, శేషాద్రి, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిచారు. కళాశాల ఆవరణలోని పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు,ఎంపీడీవో లీలా మాధవి ప్రిన్సిపల్ జయప్రకష్ ఆవరణంలో పలు మొక్కలను నాటారు, అనంతరం శుభ్రత పరిశుభ్రత పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి బాలాజీ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అమర రాజా గ్రూప్ 40వ ఫౌండేషన్ డే వేడుకలు





**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20 :**
విభిన్న రంగాల్లో విశేష సేవలందిస్తూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన అమర రాజా గ్రూప్ తన 40వ ఫౌండేషన్ డే వేడుకలను తిరుపతిలో ఘనంగా నిర్వహించింది. 1985లో అమర రాజా పవర్ సిస్టమ్స్‌గా ప్రారంభమైన ఈ గ్రూప్,నేడు 6 కంపెనీలు,17 వ్యాపార విభాగాలు మరియు 21,000కు పైగా ఉద్యోగులతో దేశీయంగా, అంతర్జాతీయంగా విశ్వసనీయ సంస్థగా ఎదిగింది.ఫౌండేషన్ డే వేడుకల సందర్భంగా, సమాజాభివృద్ధి పట్ల తన నిబద్ధతను చాటుతూ అమర రాజా గ్రూప్ 'అమర రాజా బెటర్ వే అవార్డ్స్' విజేతలను ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన ముగ్గురు గ్రామీణ వ్యాపార సంస్థలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతితో పాటు, వారి వ్యాపారాభివృద్ధికి ఒక సంవత్సరం పాటు మార్గదర్శకత్వం మరియు సహకారం అందించనున్నట్లు వెల్ల డించింది. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ చైర్మన్ జయ దేవ్ గల్లా మాట్లాడుతూ, "ఈ ఏడాది 'ఫారెవర్ త్రూ టైమ్' అనే థీమ్ మా నాలుగు దశాబ్దాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. పరిశ్రమలను పునర్నిర్వచిస్తూ, వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా భవిష్యత్తు వైపు దృఢంగా ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా అమరరాజా గ్రూప్ దాదాపు 300 మంది ఉద్యోగులకు ఛాంపియన్ అవార్డ్స్, లాంగ్ సర్వీస్ అవార్డ్స్ అందించి సత్కరించింది. అలాగే సంస్థకు గత నాలుగు దశాబ్దాలుగా సహకారం అందిస్తున్న సమీప గ్రామాల పంచాయతీ నాయకులను గౌరవించింది. అమర రాజా ఉద్యోగుల పిల్లలకు బెస్ట్ స్టూడెంట్ అవార్డ్స్ అందించగా, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమానికి అమరరాజా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ డా.రామచంద్ర నాయుడు గల్లా, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, అమర హాస్పిటల్ ఎండీ డా.రమాదేవి గౌరినేని, అమరరాజా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని, గ్రూప్ ఆపరేషన్స్ హెడ్ నరసింహులు నాయుడు, పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమీప గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

## పదవతరగతి పరీక్షలలో 100% ఉత్తీర్ణత లక్ష్యముగా పనిచేయాలి.

### ఎంపిడిఓ ఏపిఆర్ కుమార్ పిలుపు



**శాంతిపురం, చిత్తూర్ ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
మండలములోని కెనమాకులపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నందు శనివారం విద్యార్థులు మరియు ఉఫాధ్యాయులతో కలిసి సమీక్షా సమావేశము నిర్వహించారు, ఈ సంధర్భముగా ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ మాట్లాడుతూ ఈ కెనమాకులపల్లె ఉన్నత పాఠశాల నందు ఎక్కువ మంది విద్యార్థులు షైనింగ్ కేటగిరి క్రింద మరియు కొంత మంది విద్యార్థులు రైసింగ్ కేటగిరి క్రింద వున్నారని, ఈ రైసింగ్ కేటగిరి క్రింద వున్నవారిని వంద రోజుల కార్యచరణ ప్రణాళిక ద్వారా ప్రతి రోజు 4 సబ్జెక్టులను భోదిస్తూ, ప్రతి రోజు పరీక్షలు నిర్వహిస్తూ, వారి యొక్క ప్రగతి ని సమీక్షించడం జరుగుతుందని, ఏ సబ్జెక్టులో అయితే వెనుకబడి వున్నారో వారిపైన ప్రత్యేక దృష్టి పెట్టి వారిని కూడా షైనింగ్ కేటగిరి విద్యార్థులుగా తయారుచేయుటకు ఉఫాధ్యాయులు కృషిచేస్తున్నారని ఎంపీడీఓ తెలిపారు. పదవతరగతి విద్యార్థుల తల్లితండ్రులతో తరచుగా సమావేశములు నిర్వహించి. ఇంటి దగ్గర కూడా విద్యార్థులు బాగా చదివే విధముగా చర్యలు తీసుకొంటామని, ఈ విద్యాసంవత్సరములో మెరుగైన ఫలితాలు సాదిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పధానోఫాద్యాయురాలు జయసుధ, ఉఫాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలకు బీరువా వితరణ



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నత పాఠశాలకు దాత బీరువాను విరాళంగా అందించారు. మండలంలోని కాకతి పంచాయతీ కరణం వారి పల్లికి చెందిన రాజేంద్ర కుమారుడు దివిక్ పుట్టినరోజును పురస్కరించుకొని పాఠశాలకు బీరువాను విరాళంగా అందించినట్లు ఆయన తెలిపారు, జన్మదినం సందర్భంగా పాఠశాలకు బీరువాను విరాళంగా ఇవ్వడం పట్ల ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమల ప్రధానోపాధ్యాయురాలు పద్మజలు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు స్థానికులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోండి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిని మోనా అన్నారు. పల్స్ పోలియో విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక బస్టాండ్ లో ర్యాలీ నిర్వ హించారు,ఐదేళ్ల లోపు పిల్లలందరిని పల్స్ పోలియో కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని కోరారు, అనంతరం బస్టాండ్‌లో ర్యాలీఅవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం.



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
పలమనేర్ పట్టణ సమీపంలో గల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల నందు ఐసిడియస్ ఆధ్వర్యంలో సిడిపిఓ ఉమారాణి అధ్యక్షతన పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ సహకారంతో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలమనేర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఉమారాణి మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు బాల్యవివాహాలు నివారణ కోసం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం చేపడుతున్నామని గుర్తు చేశారు. బాల్య వివాహాలు చేయడం వలన ఆడపిల్లలకు వచ్చే ప్రమాదాలు గురించి క్లుప్తంగా వివరించడం జరిగిందన్నారు. అదేవిధంగా అనేక చోట్ల బాలికల అదృశ్యం కావడం, అక్రమ రవాణా ఆ సందర్భంలో ఎలా ఎదుర్కోవాలో హాజరైన బాలికలకు సూచనలు ఇవ్వడం జరిగింది అన్నారు. బాలికలకు ఎవరైనా మాయ మాటలు చెప్పాలని ప్రయత్నించిన, తినుబండారాలు ఎర చూపి కోసం చేయాలని అనుకున్న వాటిని ఎలా ధైర్యముగా ఎదుర్కొనే మనో ధైర్యాన్ని బాలికలకు కలిగించాం న్నారు. ఇటువంటి దుశ్చర్యలను పోలీస్ వ్యవస్థ కూడా పెద్ద ఎత్తున తీసుకొని బాలికలకు ధైర్యాన్ని నింపుతున్నారని అనేకమైన కేసులు నమోదు చేసి శిక్ష పడే విధంగా చేశారని కొనియాడారు. ముఖ్యంగా బాలికలు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా సెల్ ఫోన్లకు ఎంత దూరంగా ఉంటే అంత మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. అనంతరం బాలికల చేత బాల్య వివాహాల రహిత భారత్ గా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేస్తాము అనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ చిలకమ్మా, మహేశ్వరి, శాంతి, రాధా పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపే భావితరాలకు మార్గం

### ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, డిసెంబర్ 20:**
విద్యుత్‌ను ఇప్పటినుంచే పొదుపుగా వినియోగిస్తే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శనివారం పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధిం చిన విద్యార్థులకు ఆయన బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో సాంకేతిక అభివృద్ధితో విద్యుత్ వినియోగం మరింత పెరుగుతుందని, ప్రతి పనికీ విద్యుత్ అవసరం అవుతుందన్నారు. అందువల్ల విద్యుత్‌ను బాధ్యతగా, పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే ప్రతి ఇంటి వద్ద సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధ్యమని, దీనిపై ప్రజలు అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు. విద్యతో పాటు విద్యుత్ విలువలను గుర్తించి, భావితరాలకు మార్గదర్శకులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వక్తృత్వం, వ్యాసరచన, డ్రాయింగ్,ఎలక్ట్రీషియన్ పోటీలు నిర్వహించగా, గెలుపొందిన 12 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ (రూరల్) సురేష్ కుమార్, ఏడీఈ శేషాద్రి రెడ్డి, ఏఈ తులసీ ప్రసాద్,ఎంఈఓ భాస్కర్ నాయుడు, హెడ్‌మాస్టర్ రమేష్ బాబు, విద్యా కమిటీ చైర్మన్ మునీంద్ర బాబు, ఎల్ఐ ప్రభాకర్ రెడ్డి, ఎల్ఎం రాజేంద్ర రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రాభివృద్ధి ఆగదు

-మొదటిపేజీ తరువాయి

పాల్గొని ప్రసంగించారు. 'స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా ప్రజల జీవన విధానంలో మార్పు తేవాలనే లక్ష్యంతో దీనికి శ్రీకారం చుట్టాము. 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ తయారు కావాలి. గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాదు...ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. ఈ స్వచ్ఛ ఉద్యమంలో ముందుండి నడిపిస్తున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈసారి పర్యావరణంలో అవకాశాలు అందుకోవడం థీమ్‌గా తీసుకున్నాం. పర్యావరణం మనకు జీవనోపాధి కల్పిస్తుంది. సమగ్ర ఆర్థిక వద్ధికి దోహద పడుతుంది. వ్యర్థాలుమురుగు నీటి నిర్వహణ, రీసైక్లింగ్ యూనిట్లు, కంపోస్టింగ్, పారిశుధ్య సేవలు, హరిత ఉత్పత్తులు, సర్క్యులర్ ఎకానమీ కార్యకలాపాలు...ఇవన్నీ స్థానికంగా ఉపాధి కల్పించేవే. ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీ 2025ను తీసుకువచ్చాం. పొడి, తడి చెత్తను వేరు చేయడంపై చాలామందిలో అవగాహన వచ్చిందని పలువురు పారిశుధ్య కార్మికులు స్వయంగా నాకు చెప్పారు. వ్యర్థాలను వనరుగా, సంపదగా మారుస్తూ సర్క్యులర్ ఎకానమీకి అసలైన అర్థాన్నిచ్చాం. స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో పారిశుధ్య కార్మికులే నిజమైన సైనికులు. అందుకే వారి గౌరవం పెరిగేలా, వారి ఆరోగ్యానికి భద్రత కల్పించేలా చర్యలు తీసుకున్నాం. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాకారం అవుతుంది. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి 21 విభాగాల్లో 69 రాష్ట్ర స్థాయి, 1,257జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. ఓవైపు అభివద్ధి మరోవైపు సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంటే కొందరు రాక్షసులు వివిధ రూపాల్లో అభివద్ధి యజ్ఞాన్ని




అడ్డుకుంటున్నారు. ఐటీ కంపెనీలకు భూములు ఇస్తే కేసులు వేస్తున్నారు. గత పాలకులు చెత్తపై పన్ను వేయడమే కాకుండా 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మనకు వారసత్వంగా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త మొత్తం తొలగించాం. 2026, జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత ఏపీ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, రీసైక్లింగ్ యూనిట్లు, కంపోస్ట్ తయారీతో ఏ రోజు చెత్తను ఆరోజు ప్రాసెస్ చేస్తున్నాం. జనవరి 26 నాటికి రాష్ట్రంలో రోడ్డుపై చెత్త అనేది కనపడకూడదు. ఫిబ్రవరి 15 నాటికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి దగ్గర చెత్త సేకరించేలా ఏర్పాట్లు చేస్తాం. అక్టోబర్ 26 నాటికి పొడి,తడి చెత్త వేరు చేయడం 100 శాతం పూర్తి కావాలి. గ్రామాల్లో 10 లక్షల ఇళ్లలో కంపోస్ట్ తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంటి వ్యర్థాలను కంపోస్ట్ గా తయారు చేసుకొని కూరగాయలు పండించుకోవచ్చు. వీలైనంత వరకూ కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే ఏడాది అక్టోబర్ 2 తర్వాత ఎక్కడా ప్లాస్టిక్ కనపడకూడదు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 25 ప్రాంతాల్లో స్వచ్ఛ రథాలు ఉన్నాయి. త్వరలో మరో 100 ప్రారంభిస్తాం. ప్రతీ ఉమ్మడి జిల్లాకు 6 నుంచి 8 చొప్పున స్వచ్ఛ రథాలు కేటాయిస్తాం. స్వచ్ఛ రథాలు ఏర్పాటు చేశాక గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇంట్లో చెత్త తీసి రోడ్డుపై వేసే అలవాట్లు మానుకోవాలి. అందరిలో సామాజిక స్పృహ రావాలి అని సీఎం చంద్రబాబు అన్నారు.

# వందో టెస్ట్ కు రెడీ అవుతున్న ఇస్రో

**నెల్లూరు :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఒకప్పుడు సైకిల్‌పై రాకెట్లను తీసుకెళ్లి ప్రయోగాలను చేపట్టింది. అంతరిక్ష ప్రయోగాల్లో దిగ్గజాలు అయిన రష్యా, అమెరికా లాంటి దేశాలు మన ఇస్రోను అవహేళన చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇపుడు అదే రష్యా, అమెరికా దేశాలకు చెందిన కీలక ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశ పెట్టే స్థాయికి ఇస్రో చేరుకుంది. ఐదేళ్ల క్రితం వరకు చిన్నచిన్న ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించే సామర్థ్యం ఉన్న ఇస్రో, ఇప్పుడు అత్యంత భారీ ఉపగ్రహాలను సైతం అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే సామర్థ్యమున్న రాకెట్‌ను తయారు చేసింది. మరి కొన్ని రోజుల్లో ఈ మహా బాహుబలి రాకెట్ ప్రయోగం జరగనుంది. ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో ఇది నూరవది. ఈ సందర్భంగా అత్యంత భారీ రాకెట్‌ను ప్రయోగించనుంది ఇస్రో.ఇస్రో ప్రస్థానంలో మరో మైలు రాయిని దాటేందుకు కౌంట్ డౌన్ షురూ అయింది.. డిసెంబర్ 24వ తేదీన జరిగే ఒఎం 3 ప్రయోగంతో ఇస్రో సెంచరీ కొట్టనుంది. అమెరికా-భారత్ సంయుక్తంగా చేపడుతున్న ప్రయోగం ఇది. ఇస్రో చేపడుతున్న వందో ప్రయోగమే కాకుండా ఇంకా ఈ లాంచ్ ద్వారా ఇస్రో కొత్త రికార్డు కొట్టబోతోంది. 24వ తేదీన శ్రీహరికోట నుంచి ఈ మెగా బాహుబలి రాకెట్ ప్రయోగం జరగనుంది. ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో అత్యంత భారీ రాకెట్ మాత్రమే కాదు.. ఇది ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో ఇది నూరవది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి బ్లూబర్డ్?6 ప్రయోగం జరగనుంది. ఈ ఉపగ్రహాన్ని రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్న బ్లూబర్డ్ శాటిలైట్. భారత్?అమెరికా సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని చేపడుతున్నాయి. ఇస్రో రాకెట్ ప్రయోగ తేదీ డిసెంబర్ 24 గా ప్రకటించింది. ఎల్‌వీఎమ్-3ఎం 6 రాకెట్ ప్రయోగానికి చాలా ప్రత్యేకత ఉంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వద్ద రెండు టన్నుల బరువున్న ఉపగ్రహాలను మాత్రమే నింగిలోకి ప్రవేశ పెట్టగలిగేది. అంతకంటే బరువైన ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాలంటే ఫ్రెంచ్ గయా, రష్యా లాంటి దేశాల నుంచి ఆదేశాల సహకారంతో ఉపగ్రహాలను ప్రవేశపెట్టేది ఇస్రో.ఇస్రో ఈ పరిస్థితులను అధిగమించింది. సరికొత్త వాహక నౌకను తయారు చేసింది.. 4 టన్నుల బరువు ఉన్న ఉపగ్రహాలను సైతం నింగిలోకి తీసుకెళ్లే సామర్థ్యం కలిగిన




రాకెట్ ను తయారు చేసి సక్సెస్ చేసింది. ఈ రాకెట్ ను బాహుబలి రాకెట్ గా పిలిచేవారు. ఇప్పుడు అంతకు మించి అన్నట్లు ఇంకా చెప్పాలంటే బాహుబలి-2 రాకెట్ అన్నట్లుఅ ప్‌గ్రేడ్ అయ్యింది. 6.5 టన్నుల బరువున్న అమెరికాకు చెందిన బ్లూ బర్డ్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశ పెట్టనుంది. ప్రయోగ సమయం 24 ఉదయం 8.50 గంటలకు ఉంటుందని ఇస్రో అధికారికంగా ప్రకటించింది.టెక్సాస్ కేంద్రంగా పనిచేసే ం స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన బ్లూబర్డ్ శ్రేణి ఉపగ్రహం ప్రపంచవ్యాప్తంగా నేరుగా మొబైల్ బ్రాడ్ బ్యాండ్ సేవలను మెరుగ్గా అందించేందుకు ఈ బ్లూ బర్డ్ శాటిలైట్‌ను రూపొందించారు. ఈ ఉపగ్రహం హై బ్యాండ్‌విడ్త్ నెట్‌వర్క్ అందించే సామర్థ్యం కలిగి ఉంటుంది. భూమిపై పనిచేస్తున్న మొబైల్ నెట్‌వర్క్ సేవలకు లైసెన్స్ స్పెక్ట్రమ్ ద్వారా అనుసంధానమై సేవలను విస్తరించేలా ఈ వ్యవస్థ పని చేస్తుంది. అక్టోబరు 19న అమెరికా నుంచి బ్లూబర్డ్-6 ఉపగ్రహం శ్రీహరికోటకు చేరి అనుసంధాన పనులు, ఇంధన నింపుదల, తుది తనిఖీల పరిశీలనలు శాస్త్రవేత్తలు విజయవంతంగా పూర్తి చేశారు.ఇతర ఉపగ్రహాల కంటే మూడున్నర రెట్లు పెద్దదిగా, సుమారు పది రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేయనుంది. ఇదే రాకెట్ ద్వారా భారత్ చేపట్టనున్న గగన్యాన్ ప్రాజెక్టు ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది ఇస్రో. ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో వందవది కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల తోపాటు మాజీ శాస్త్రవేత్తల్లో కూడా ఇస్రో ఘనత అనే గర్వం కనబడుతోంది..

# జగన్ గ్రాఫ్ వీకైందా...

**విజయవాడ :** మరి కొద్ది రోజుల్లో 2025 సంవత్సరం ముగియనుంది. క్యాలెండర్‌లో మరో పేజీ తిప్పడానికి సమయం దగ్గర పడుతుండటంతో రాజకీయ వర్గాల్లో ఈ ఏడాది గమనంపై చర్చ మొదలైంది. ఒక రకంగా చెప్పాలంటే 2025 రాజకీయంగా ఎక్కువగా ఒకే దిశలో సాగిందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రాజకీయంగా బలంగా కనిపించగా, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం పరిమితంగానే ప్రజల్లోకి వచ్చారు అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారుజగన్ ఈ ఏడాది ఎక్కువగా రైతుల సమస్యలపై దృష్టి పెట్టారు. పంట నష్టాలు, ధరల సమస్యలు ఎదుర్కొంటున్న రైతులను పరామర్శిస్తూ వారి పక్షాన నిలుస్తామని భరోసా ఇచ్చారు. అలాగే తమ పార్టీ నేతలు అరెస్టులు ఎదుర్కొన్న సందర్భాల్లో జైలులో ములాఖత్ ద్వారా కలుసుకుని, ఆ తర్వాత కొంతకాలం ప్రజల మధ్య కనిపించారు. అయితే ఆయన పర్యటనలు ఎక్కువగా గుంటూరు , విజయవాడ పరిసర ప్రాంతాలకే పరిమితమయ్యాయని పార్టీ వర్గాలు స్వయంగా చెబుతున్నాయి.2025 చివర్లో జగన్ చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమంగా విజయవాడలోని జోజినగర్ ఘటన. అక్కడ



42 ప్లాట్లు కూల్చివేతకు గురైన బాధితులను ఆయన స్వయంగా పరామర్శించారు. బాధిత కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటుందని, అవసరమైతే న్యాయ సహాయం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు చేశారు. చాలా కాలం తర్వాత ఆయన నేరుగా ప్రజల్లోకి వచ్చారని కార్యకర్తలు చెప్పుకుంటున్నారు.ఇటీవల పులివెందుల లో రైతులను కలిసి వారి పొలాల్లోకి వెళ్లడం, మోత్వా తుఫాను సమయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మచిలీపట్నం పర్యటన కూడా ఈ ఏడాది జగన్ చేసిన ముఖ్యమైన కార్యక్రమాలుగా చెప్పవచ్చు. అలాగే విశాఖ జిల్లా నర్సీపట్నం లో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటీకరించ వద్దంటూ నిర్వహించిన కార్యక్రమం, మాకవరపాలెం లో నిర్మించిన కళాశాల సందర్శన కూడా రాజకీయంగా ప్రాధాన్యం పొందాయి. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం లో మామిడి రైతుల సమస్యలు, నెల్లూరు జిల్లా పర్యటన కూడా ఆయన 2025లో చేసిన కార్యక్రమాల్లో భాగమేఈ ఏడాది మిగిలిన రోజుల్లో జగన్ మరిన్ని పెద్ద కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు తక్కువే. కానీ 2026లో మాత్రం ఆయన పూర్తిగా ప్రజల్లోనే ఉంటారని పార్టీ స్పష్టం చేస్తోంది. జనంతో మమేకమయ్యేలా విస్తృత కార్యాచరణకు వైసీపీ నాయకత్వం సిద్ధమవుతోందని సమాచారం. మొత్తం మీద 2025 చివర్లో జరిగిన విజయవాడ పర్యటన జగన్ రాజకీయ ప్రయాణంలో ఒక కీలక మలుపుగా కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. కొత్త ఏడాదిలో వైసీపీ అడుగులు ఏ దిశగా పడతాయో అన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో పెరుగుతోంది.

## మీ చాప్టర్ క్లోజ్...

-మొదటిపేజీ తరువాయి

సవిత ఎద్దేవా చేశారు. "ప్రజలు మీ నాటకాలను గ్రహించి, మిమ్మల్ని రాజకీయాల నుంచి డైవర్షన్ చేసి ఇంటికి పంపారు. చంద్రబాబు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మేం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం" అని ఆమె అన్నారు. 17 మెడికల్ కాలేజీలు తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్న జగన్, వాటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఖర్చు చేసింది సున్నా అని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.1,550 కోట్ల నిధులతోనే పనులు మొదలుపెట్టి మధ్యలో వదిలేశారని, దీనిపై త్వరలోనే ఆరోగ్య శాఖ మంత్రి పూర్తి లెక్కలతో వాస్తవాలు బయటపెడతారని తెలిపారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే పీపీపీ మోడల్‌లో మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని సవిత స్పష్టం చేశారు. "ప్రజలకు మంచి జరుగుతుంటే దానిపై కూడా విషం చిమ్మడం మీ దిగజారుడుతనానికి నిదర్శనం. పీపీపీ విధానం ఇతర రాష్ట్రాల్లో ఎలా విజయవంతమైందో మీకు తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారు" అని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడం, ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాసి అప్పులు పుట్టకుండా చేయడం వంటి చర్యలతో జగన్ 'ఆంధ్రప్రదేశ్ ద్రోహి'గా మారుతున్నారని ఆమె హెచ్చరించారు. "మీ సొంత తల్లి, చెల్లి కూడా మిమ్మల్ని నమ్మని పరిస్థితి ఉందంటే మీ వ్యక్తిత్వం ఏంటో ప్రజలు అర్థం చేసుకున్నారు" అని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి సవిత వివరించారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు, మంత్రి లోకేశ్ విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నారని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. "మీరు ప్రజావేదికను కూల్చి, పోలవరాన్ని పాడుబెట్టి, టిడ్కో ఇళ్లను గాలికి వదిలేశారు. కానీ మేము వాటిని పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్నాం. ప్రజల సొమ్ముతో మొదలుపెట్టిన ఏ ప్రాజెక్టునైనా పూర్తి చేయాలన్నదే మా ప్రభుత్వ ధ్యేయం" అని అన్నారు. "ముప్పై ఏళ్లు నేనే సీఎం అని విర్రవీగిన మీకు, ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదంటే మీ పార్టీ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోండి. మీ చాప్టర్ క్లోజ్ అయిపోయింది. ఇప్పటికైనా భ్రమల నుంచి బయటకు వచ్చి, అభివృద్ధికి సలహాలు ఇవ్వండి. మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో పూర్తి చేసి తీరుతాం. పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే మా లక్ష్యం" అని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## పద్ధతులు మార్చుకోండి

-మొదటిపేజీ తరువాయి

ఏకమయ్యాం. ఎవరి ప్రాణ త్యాగంతో రాష్ట్రం ఏర్పడిందో వారిని స్మరించుకోవడం మన ధ్యేయం. త్యాగజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి దండ వేద్దామంటే ఎక్కడా విగ్రహం కనిపించలేదు. రాష్ట్రం కోసం త్యాగం చేసిన వ్యక్తిని నెల్లూరు జిల్లాకు పరిమితం చేశాం. ప్రధానిమంత్రికి ప్రపంచమంతా శత్రువుల్లా తయారయ్యారు. కొన్ని పరిణామాల వల్ల ఆయన నా సభలకూ రావడానికి ఇబ్బంది పడుతున్నారు. తెలుగు జాతి, తెలుగు ఆత్మగౌరవం అని మొదటిసారి మాట్లాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. డొక్కా సీతమ్మ కులం చూడలేదు. అమ్మా.. ఆకలి అంటే అన్నం పెట్టారు. చిన్న పిల్లలకు గుర్తుండిపోయేలా మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టాం. రాష్ట్రానికి మంచి స్పందన జరగాలనే నేను తగ్గి, కూటమితో కలిశాను' అని పవన్ పేర్కొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో వాటర్ గ్రిడ్ పథకం చేపట్టామని ఈ సందర్భంగా పవన్ అన్నారు. 'అక్వా కల్చర్ వలన భూగర్భ జలాలు కలుషితమయ్యాయంటే నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదు. రూ.7,500 కోట్లతో స్వచ్ఛమైన తాగునీరు రాష్ట్రంలో అందరికీ అందిచాలని నిర్ణయించాం. మీరు అధికారంలో ఉన్నప్పుడు మీకు నేను భయపడలేదు. మీ దౌర్జన్యాలకు భయపడలేదు. అధికారంలోకి వస్తే చంపేస్తాం.. అంటే ఏం మాట్లాడతాం. సిగ్గుందా అలాంటి మాటలు మాట్లాడడానికి? మేము అధికారంలోకి వస్తే కాంట్రాక్టర్లను జైలులో వేస్తామంటున్నారు. అలాంటి వారికి పవన్ కళ్యాణ్ భయపడడు. వారి వెనుక రౌడీలు ఉంటారని అధికారులు భయపడుతున్నారు. అటువంటి రౌడీలకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లా.. కాలికి కాలు, చెయ్యికి చెయ్యి అనేలా ట్రీట్మెంట్ ఇస్తే.. వారంతా కకావికలం అయిపోతారు. మేమంతా కూర్చుని ఒక నిర్ణయం తీసుకుంటే వారు ఏమైపోతారు? పద్ధతులు మార్చుకోండి. గీతలు దాటి మాట్లాడొద్దు. అలా మాట్లాడితే.. వారి చేతుల్లో గీతలు తీసేస్తాం. పాత పద్ధతిలోనే మేముంటామని వైసీపీ నేతలు అంటే.. నేను విసిగిపోయాను. అలాంటి వారి ప్రాణాలకు గ్యారంటీ లేదు. అడ్డగోలుగా వెళతామంటే.. రోమం రోమం తీసేసి కూర్చోబెడతాం. నాయకులు చేసే పాపాలకు ప్రజలు ఇబ్బందులు పడాలా? కులాల సమూహం అని కొట్టుకుంటున్నారే గానీ.. సమూహంగా మన దేశం కోసం మాట్లాడడం లేదు' అని జనసేన అధినేత పవన్ పేర్కొన్నారు

## 28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

-మొదటిపేజీ తరువాయి



అనూహ్యంగా 28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. 24 గంటల్లో రూ. 7,300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరులో ఆయన ధాన్యం కొనుగోలును పరిశీలించి ధాన్యం రాశు లు, వరి నూర్పిడి వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ధాన్యం శాంపిల్స్ తీయడంలో ఇబ్బందులు రావడం వల్లే తేమ శాతంలో తేడాలు వస్తున్నాయని అన్నారు. బ్యాంక్ గ్యారెంటీల విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. 43 వేలమంది రైతులు వాట్సప్ ద్వారా ధాన్యం విక్రయించారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గత సంవత్సరం కంటే వినియోగదారుల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

### ప్రతీ బస్తా కొంటాం

పామర్రు నియోజకవర్గంలో అత్యధికంగా లక్షా నలభై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ. 300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. కృష్ణా జిల్లాలో వైఎస్సార్సీపీ 4 లక్షల మెట్రిక్ టన్నుల ధ్యాన్యం కొనుగోలు చేస్తే, కూటమి ప్రభుత్వం 6 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందన్నారు. ఈ సంవత్సరం 7 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని టార్గెట్ పెట్టుకున్నామని మంత్రి తెలిపారు . రైతులకు అందించాల్సిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ బస్తా కొనడానికి ప్రయత్నిస్తున్నామని, వారికి ఎలాంటి సమస్యలు రాకుండా వ్యవస్థను బలోపేతం చెయ్యడం కోసం ప్రయత్నిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి రైతులకు మేలు చేకూర్చేలా సంస్కరణలు తీసుకొస్తుందన్నారు.

'తేమ శాతంలో తేడా రాకుండా రైతు భరోసా కేంద్రంలో ఏ పరికరమైతే ఏర్పాటు చేశారో అదే మిల్లర్ దగ్గర ఉంచాం. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులు చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొంటున్నారు. కృష్ణా జిల్లాలో డ్రైయింగ్ సదుపాయం ఎక్కువగా లేదు. అయినప్పటికి అన్ని విధాలా రైతులకు అండగా ఉంటున్నాం. శాంపిల్ కలెక్షన్‌లో తేడాల వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. రైతు సహాయ కేంద్రాల్లో వెల్లడించిన తేమ శాతాన్నే పరిగణించాలని బ్లూటూత్ ద్వారా మిల్లర్‌కు, రైతులకు తదితర అధికారులకు పంపిస్తున్నాం. తేమ విషయంలో రైతన్న నష్టపోకుండా చూస్తాం.' - మంత్రి నాదెండ్ల మనోహర్

ఎస్‌ఓపీ తయారు చేసినప్పుడు బ్యాంక్ గ్యారెంటీ విషయంలో పారదర్శకంగా ఉండాలని మిల్లర్లకు సూచించామన్నారు. వాళ్ల కోటా ముగియడంతో ఇంకా కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చెయ్యకపోవడం వల్ల మిల్లర్లు బాండ్లు సేకరిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు.

# ఉచిత వైద్య శిబిరం సూపర్ సక్సెస్

**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
వెదురుకుప్పం మండలం పచ్చికాపలంలో ఉన్న శ్రీలక్ష్మీ గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నా గౌరీ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం సూపర్ సక్సెస్ అయిందని లక్ష్మీ గ్రూప్స్ అధినేత ప్రసాద్ తెలిపారు ఈ సందర్భంగా లక్ష్మి గ్రూప్స్ అధినేత ప్రసాద్ మాట్లాడుతూ నేను వ్యాపారం రంగంలో వచ్చిన కొంత ఆదాయంతో పేద ప్రజలకు సేవ చేయాలనే సేవా దృక్పథంతో మొదటిసారిగా వెదురు కుప్పం మండలం ఆళ్లమడుగు వినాయక స్వామి గుడి వద్ద మొదటి మెడికల్ క్యాంపు నిర్వహించామని ఈ మొదటి మెడికల్ క్యాంపుకు సుమారు 200 మంది దాకా రోగులు వచ్చి వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అలాగే వారు కావలసిన మందులను ఉచితంగా అందించారు. అని తెలిపారు. ఇలా ప్రతి నెలకు ఒకసారి అన్నా గౌరీ హాస్పిటల్ ద్వారా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తానని తెలిపారు అలాగే ఓ మహిళకు నడవడానికి ఇబ్బంది. పడుతుంటే ఆమెకు పరీక్ష చేయగా ఆమెకు మోకాళ్లు చికిత్సకు సుమారు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని తెలపడంతో ఆమెకు చికిత్స అయ్యే ఖర్చు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని లక్ష్మీ గ్రూప్స్ అధినేత ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్న గౌరీ హాస్పిటల్ సిబ్బంది, అనిత వివేక్ కార్తీక్ వీరితో పాటు లక్ష్మీ గ్రూప్స్ టీం శివ చింటూ సోము ధనరాజ్ చందు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్టే

**వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పరిపూర్ణ అవగాహన అవసరం**
**ముస్తాబు కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించిన**
**ఎమ్మెల్యే సతీమణి రేణుకా రెడ్డి**

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**



ఆరోగ్యం కోల్పోతే సర్వస్వం కోల్పోయినట్టేనని కాబట్టి ఆరోగ్యమే మహాభాగ్యంఅనే విషయాన్ని విద్యార్థులు గుర్తించు కోవాలని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి సతీమణి రేణుకరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం పాఠశాలలో ప్రారంభించిన ముస్తాబు ప్రభుత్వ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత దైనందిన జీవితంలో ఓ భాగం కావాలని ఆమె సూచించారు. పరిశుభ్రత పాటించక పోతే రోగాలు దరిచేరే ఆస్కారం ఉంటుంది, కాబట్టి అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని దీంతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటు అవుతుందని ఆమె వివరించారు. అనంతరం ముస్తాబు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కు ఆచరణాత్మకంగా వ్యక్తిగత పరిశుభ్రత, ముస్తాబు అంశాలపై అవగాహన కల్పించారు. తదనంతరం పాఠశాలకు అవసరమైన వాటర్ క్యాన్లను అందజేశారు. చివరగా బాలోత్సవం కార్యక్రమంలో వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ఆమె సర్టిఫికెట్లను ప్రధా నం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి, పాంశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, సిబ్బందితో పాటు సామాజిక వేత శ్రీపురం సీతారామయ్య, ప్రముఖ వ్యాపారి నరేంద్ర తదితరులు ఉన్నారు.

# భారతీయ అంబేద్కర్ సేన
# 14 ఆవిర్భావ దినోత్సవం

**శాంతిపురం అంబేద్కర్ సర్కిల్ నడిబొడ్డున భారతీయ అంబేద్కర్ సేన జెండా ఆవిష్కరణ..**
**నిరంతరం బడుగు బలహీన వర్గాల హక్కుల కోసమే భారతీయ అంబేద్కర్ సేన పోరాటం...**



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం పరిధిలోని బాబాసాహెబ్ అంబేద్కర్ సర్కిల్ నందు భారతీయ అంబేద్కర్ సేన జండా ఎగరవేసి భారతీయ అంబేద్కర్ సేన 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని భారతీయ అంబేద్కర్ సేన నాయకులు కార్యకర్తలు అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బాస్ నాయకులు మాట్లాడుతూ, భారతీయ అంబేద్కర్ సేన సంస్థ 14 సంవత్సరాలు సుదీర్ఘ కాలంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిందన్నారు. భారతీయ అంబేద్కర్ సేన దేశ ప్రజలను సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాంస్కృతికంగా చైతన్యం చేసే దిశగా ప్రయాణం చేస్తుందని చెప్పుకొచ్చారు. దళిత గిరిజనులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని 2013లో గౌరవ భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్ గారి నాయకత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ రేట్ ముందు రెండు రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి దళితులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత భారతీయ అంబేద్కర్ సేనకే దక్కుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో దేశంలో ఎక్కడ కుల దురహంకార హత్యలు జరిగిన, ఎక్కడ వివక్షత అంటరానితనం నెలకొన్న ఎక్కడ భూ ఆక్రమణకు పాల్పడిన భారతీయ అంబేద్కర్ సేన బాధితిలు పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకూ పోరాటం చేసిందని అన్నారు. భవిష్యత్తులో కులాలకు మతాలకు అతీతంగా ఎక్కడ అన్యాయం జరిగిన భారతీయ అంబేద్కర్ సేన ద్వార వారి పక్షాన పోరాడటానికి సమసిద్ధంగ ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ,రాష్ట్ర నాయకులు నాగరాజు, నియోజకవర్గ నాయకులు ఎల్లప్ప, నియోజకవర్గ నాయకులు తిమ్మరాజు, మండల నాయకులు నాగభూషణం, మంజునాథ్, నిజానందం స్వామి, కళ్యాణ్, బాలకృష్ణ, కళ్యాణ్, మనీ, అభిషేక్,శ్రీకాంత్ హేమాద్రి, సింహాద్రి, అంబేద్కర్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# విశ్వభారతిలో గ్రీన్ డే వేడుకలు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20**
శ్రీకాళహస్తి పట్టణం గోపాలవనంలో గల విశ్వభారతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం గ్రీన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలు అందరూ గ్రీన్ డ్రెస్ లో వచ్చారు. పచ్చని మొక్కలు, పచ్చని కూరగాయలు తెచ్చారు. అలాగే మొక్కలు నాటారు. పాఠశాల మొత్తాన్ని గ్రీన్ కలర్ తో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీధర్, కరెస్పాండెంట్ శోభా గ్రీన్ డే ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు వి.విజయ్, అఫ్రోజ్ బాబు, గురవయ్య, హసీనా పాల్గొన్నారు.

## అనాథ శవానికి స్వంత డబ్బుతో
# అంత్యక్రియలు చేసిన మాజీ సర్పంచ్ మణి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
చిత్తూరుజిల్లా కుప్పం డీ.కె.పల్లి సమీపంలో రైలు పట్టాలపై ఒక వ్యక్తి శవంగా కనుగొనబడ్డాడు. ఒరిస్సా రాష్ట్రం జాజ్‌పూర్ జిల్లా జానపూర్ సంబంధించిన చందన్ రావత్‌గా గుర్తించబడిన ఈ వ్యక్తి ఏ కారణాల వల్ల అక్కడ చనిపోయాడో తెలియడం లేదు. వారి బంధువులకు సమాచారం తెలిపినా ఎవరూ రాకపోవడంతో శవం అనాథంగా మిగిలింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు మణి తాను సహాయం చేస్తానని రంగులో నిలిచాడు. తన సొంత ఖర్చులతో సంప్రదాయబద్ధంగా రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో దహన క్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు. డీ.కె.పల్లి మాజీ సర్పంచ్ మణి మాట్లాడుతూ, “తనువు తీరిన అనాధ శవానికి సైతం నేను ఉన్నాను. మనసున్న మనిషిగా నిర్వహణ చేశాను” అని తెలిపాడు. స్థానికులు ఈ సంఘటనపై మని చర్యను ప్రశంసిస్తున్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయంలోని
# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.హేమలత ఆధ్వర్యంలో యామగాని పల్లెస్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యక్షులు ఆచార్య ఎం.దొరస్వామి పచ్చజెండా ఊపికార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకుని పనిచేయాలని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ ఈ క్యాంపు ద్వారా విశ్వవిద్యాలయం విద్యార్థులు శ్రమదానం చేసి యామగానిపల్లె అభివృద్ధిలో భాగస్తులు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కే. శ్యామల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య జె.యల్. జయలలిత, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్స్ హెల్త్ వర్కర్స్ సచివాలయం సిబ్బంది జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ హెడ్మాస్టర్ టీచర్స్ పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో వివిధశాఖలకు చెందిన విద్యార్థులు, వాలంటీర్లు 53 మంది పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి అధ్యక్షుడు
# గంధమనేని జన్మదిన వేడుకలు



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20:**
ఎస్ఆర్ పురం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు జన్మదిన సందర్భంగా పుల్లూరు క్రాస్ రోడ్‌లో అలాగే పిల్లారి కుప్పం క్రాస్ రోడ్‌లో క్షీరసముద్రం గ్రామంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తెలుగు దేశం నాయకులు గజమాలతో గంధమనేని జయ శంకర్ నాయుడునీ ఘనంగా సన్మానించి సత్కరించారు. జయశంకర్ నాయుడు జన్మదిన సందర్భంగా నారాయణవనం కళ్యాణ వెంకటేశ్వర స్వామినీ దర్శించుకున్నారు. ఈ కార్యక్ర మంలో పిఎసిఎస్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి మాజీ సర్పంచి జలంధర్ నాయుడు సాఫ్ట్వేర్ బాలు, బ్రహ్మయ్య నాయుడు,, పుల్లూరు బాబు, కటిక పల్లి బాబు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ డీకే మర్రిపల్లి నరేష్, సూర్య, ప్రసాద్, కొత్తపల్లి టిడిపి యువ నాయకుడు, దాసరి సతీష్, గల్లా రాజ్ కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల ఆదాయం పెంచుకుందాం
# -ఎంపీడీవో సురేంద్రనాథ్

**తొట్టంబేడు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 20**




గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల ఆదాయం పెంచుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులు సహకరించాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ కోరుకున్నారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఈ-గవర్నెన్స్, పంచాయతీల అభివృద్ధికి నిధులు ఎలా సమ కూర్చుకోవాలో అనే అంశంపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు పంచాయతీ కార్యద ర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్ఓలు, సర్వేయర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేంద్రనాథ్ మాట్లాడుతూ, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే.. గ్రామీ ణ ప్రాంతాలను బాగా అభివృద్ధి చేయాలలన్నారు. ఇందుకోసం కేవలం ప్రభుత్వం మీదనే ఆదారపడకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకోవడానికి వనరులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇలా చేసినపుడే పల్లెల్లో మౌళిక వసతుల కల్పనకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఈ దిశగా కృషి చేయాలని సురేంద్రనాథ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు గిరిధర్, భార్గవ్, ఏవో రవి, ఎంవోటీలు వినోద్, వంశీ పాల్గొన్నారు.

## సంపాదకీయం

# దేశంలో పౌర చైతన్యం క్షీణిస్తున్నదా?

ప్రజాస్వామ్య వ్యవస్థ కేవలం ఎన్నికలు, ఓట్లు, ప్రభుత్వాల మార్పిడికే పరిమితం కాదు. పౌరులలో నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన, సమాజంపై స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా నిలుస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికవాదం, జాతీయ ఏకత్వం వంటి రాజ్యాంగ విలువలు సమాజంలో బలపడాలంటే అవి చిన్ననాటినుంచే పౌరుల మనసుల్లో నాటుకుపోవాలి. ఇలాంటి విలువలను తీర్చిదిద్దే ప్రధాన సాధనం సామాజిక శాస్త్రాలు. అయితే నేటి పరిస్థితుల్లో ఈ సామాజిక శాస్త్రాలు విద్యా వ్యవస్థలో, సమాజంలో క్రమంగా పక్కకు నెట్టబడుతున్నాయి. ఇది భవిష్యత్ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరికగా భావించాలి. సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం సమాజానికి కేవలం ఉద్యోగులు, నిపుణులను మాత్రమే ఇస్తుందిబీ బాధ్యతాయుతమైన పౌరులను కాదు. దేశ భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యంపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే విద్యా విధానంలో సామాజిక శాస్త్రాలకు మళ్లీ కేంద్ర స్థానం కల్పించడం అత్యవసరం.మన దేశం ప్రజాస్వామ్యమని గర్వంగా చెప్పుకుంటున్నప్పటికీ, ఆ ప్రజాస్వామ్యానికి అవసరమైన పౌర చైతన్యం రోజు రోజుకు తగ్గిపోతోంది. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు పెరిగి “నేను-నాది” అనే సంకుచిత భావన సమాజాన్ని కబళిస్తోంది. ఫలితంగా కుల, మత, ప్రాంతీయ విభేదాలు బలపడుతూ, సామాజిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. దీనివల్ల దేశాభివృద్ధే గుదిబండగా మారుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటి సమాజాన్ని అర్థం చేసుకునే శాస్త్రాలైన చరిత్ర, పౌరశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, భూగోళ శాస్త్రం వంటి సామాజిక శాస్త్రాలపై పెరిగిన నిర్లక్ష్యం. నేటి విద్యా వ్యవస్థలో వైద్య, ఇంజినీరింగ్, శాస్త్రసాంకేతిక, వాణిజ్య విద్యలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే సామాజిక శాస్త్రాలను రెండో స్థాయికి పరిమితం చేస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారు అవసరమే కానీ, సామాజిక అవగాహన లేని వ్యక్తులతో దేశాన్ని సరైన దిశలో నడిపించడం సాధ్యం కాదు. ఓటు హక్కు ఎందుకు విలువైనది ప్రజాప్రతినిధులను ఎన్నుకునేటప్పుడు ఏ అంశాలను పరిశీలించాలి ప్రభుత్వాలు చేసే విధానాలు మన జీవితంపై ఎలా ప్రభావం చూపుతాయి పౌరులుగా మన బాధ్యతలు ఏమిటి ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత సామాజిక శాస్త్రాలదే. కానీ నేటి తరానికి ఈ అంశాలు సరిగా బోధించబడకపోవడం వల్లే ఓటు విలువ తగ్గిపోతుంది, ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో అపసవ్య ధోరణులు పెరుగుతున్నాయి. సామాజిక శాస్త్రాలను కేవలం పరీక్షల కోసమే చదివి ఉద్యోగాలు సాధిస్తే, వాటి అసలైన ఉద్దేశం నెరవేరినట్లుకాదు. చరిత్ర తెలియని తరానికి దేశ గతం అర్థం కాదు. ఆర్థిక శాస్త్రంపై అవగాహన లేనివాళ్లకు అసమానతల అసలు కారణాలు తెలియవు. పౌరశాస్త్రం తెలియకపోతే రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, విధులు స్పష్టంగా అవగతం కావు. ఫలితంగా బాధ్యత లేని పౌర సమాజం తయారవుతుంది. ఈ పరిస్థితుల్లో నైతిక ప్రవర్తన పెంపొందించే మార్గాలపై చర్చ అవసరం. ఈ సందర్భంలో చైనాలో అమలులో ఉన్న సోషల్ క్రెడిట్ స్కోర్ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా చర్చకు వచ్చింది. పౌరులు చేసే పనుల ఆధారంగా వారికి మంచి లేదా చెడు రేటింగ్ ఇస్తూ, మంచివారికి ప్రోత్సాహం, తప్పులు చేసిన వారికి పరిమితులు విధించే విధానం ఇది. సామాజిక సేవలు, రక్తదానం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయం, పేదలకు దోహదం, కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం వంటివన్నీ క్రెడిట్ స్కోర్‌ను పెంచుతాయి. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, సామాజిక బాధ్యతారాహిత్యం, తప్పుడు ప్రచారాలు వంటి చర్యలు క్రెడిట్‌ను తగ్గిస్తాయి. ఈ విధానం అక్కడ ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ, నిఘా వ్యవస్థల సహాయంతో అమలవుతోంది. అయితే భారతదేశంలో ఇలాంటి విధానం అమలు చేయాలంటే వ్యక్తిగత స్వేచ్ఛలు, రాజ్యాంగ హక్కులు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ నైతిక ప్రవర్తనకు ప్రోత్సాహం ఇచ్చే విధానాలపై కనీసం సమగ్ర చర్చ జరగడం అత్యావశ్యకం. మరింత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ తరహా బాధ్యత ప్రమాణాలను రాజకీయ పార్టీలకు, నాయకులకు వర్తింపజేయడం. ఎన్నికల హామీలు, పాలనలో పారదర్శకత, అవినీతిపై చర్యలు, ప్రజలకు జవాబుదారీతనం వంటి అంశాలను మదింపు చేసే సోషల్ క్రెడిట్ స్కోర్ సామాజిక పరపతి విలువ (స్వతంత్ర వ్యవస్థ) పరిధిలోకి తీసుకువస్తే.. రాజకీయ అవినీతి గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. అప్పుడే ప్రజాస్వామ్య విలువలు బలపడతాయి. సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం సమాజానికి కేవలం ఉద్యోగులు, నిపుణులను మాత్రమే ఇస్తుందిబీ బాధ్యతాయుతమైన పౌరులను కాదు. దేశ భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యంపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే విద్యా విధానంలో సామాజిక శాస్త్రాలకు మళ్లీ కేంద్ర స్థానం కల్పించడం అత్యవసరం. ప్రభుత్వాలు, విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజం కలిసి ఈ విషయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. సామాజిక శాస్త్రాల పునరుజ్జీవనం లేకుండా ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం సాధ్యం కాదు. విలువలను అర్థం చేసుకుని జీవించే పౌరులే దేశాన్ని నిజమైన అర్థంలో అభివృద్ధి పథంలో నడిపించగలరు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143